ఈనాడు ఎన్ఆర్ఐ

# అమెరికాలో జాతిపితకు ఘన నివాళి



డల్లాస్ : మే 29వ తేదీన అమెరికా దేశ సంరక్షణ కోసం అసువులు బాసిన అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశమంతటా అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న తరుణంలో డల్లాస్ నగరంలో ఉన్న అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ మెమోరియల్ వద్ద పుష్పాంజలి ఘటించడం సంతోషంగా ఉందని మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ తోటకూర అన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, భాగవత పురాణ, ఇతిహాసాలు భగవద్గీత, బ్రహ్మ సూత్రాల్లాంటి అనేక ఆధ్యాత్మిక విషయాలపై వ్యాఖ్యానాత్మక ప్రవచనా పరంపరలతో కోట్లాదిహృదయాల్లో భక్తి ప్రపత్తులు నింపిన ఒక మహా స్ఫూర్తి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ మహాత్మాగాంధీకి శ్రద్ధాంజలి ఘటించడానికి విచ్చేయడం సంతోషకరమని ప్రసాద్ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ తాను చెప్పిందే స్వయంగా ఆచరించేవారని, తాను ఆచరించిందే చెప్పేవారని, అనునిత్యం సమాజ శ్రేయస్సే తన శ్వాసగా జీవితాన్ని అంకితం చేశారని ఆయన అన్నారు.

కేవలం సనాతన ధర్మ విలువలను, వైశిష్ట్యాలను చాటి చెప్పడం, ఆధ్యాత్మిక ప్రభోధనలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, వివిధ భారతీయ కళలలో నిష్ణాతులైన వారికి పురస్కారాలు అందజేయడం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, గోసంరక్షణా బాధ్యతలు చేపట్టడం అనే విషయాలే ధ్యేయంగా రుషిపీఠం ధార్మిక సంస్థ ద్వారా సామాజిక సేవ చేస్తున్న బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ కృషి అభినందనీయమని ప్రసాద్ తోటకూర కొనియాడారు.

డాక్టర్. సామవేదం షణ్ముఖశర్మ మట్లాడుతూ..డల్లాస్ నగరంలో అన్ని జాతుల, మతాల ప్రాంతాల ప్రజలు కలిసికట్టుగా ముందుకు వచ్చి విశ్వశాంతికై పాటుబడిన మహనీయుడు మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఇర్వింగ్ పట్టణంలో సుందరమైన ఉద్యానవనంలో ఏర్పాటుచేయడంలో ప్రధాన పాత్ర వహించిన ఛైర్మన్ డాక్టర్.ప్రసాద్ తోటకూర, కార్యదర్శి రావు కల్వల కృషి ప్రశంసనీయమన్నారు. గాంధీ స్వచ్ఛ భారతానికై కలలు కన్నారని, ప్రజల్లో శుభ్రత పట్ల ఒక అవగాహన కలిగించడానికి తానే స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేసేవారని, ఇప్పుడు మన భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా అదే బాటలో పయనించడం విశేషమన్నారు. మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ కార్యదర్శి రావుకల్వల తన వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో రవి పట్టిసం, లక్ష్మి గుంటూరి, శర్మ గుంటూరి, సాంబు మంథా, డాక్టర్. నరసింహారావు వేముల, ఎంవీఎల్ ప్రసాద్, కర్రా వెంకట్రావు, వెంకట్ ములుకుట్ల తదితరులు పాల్గొని జాతిపితకు నివాళులర్పించారు.

